కథానిక

# పొన్నచెట్టు నీడలో

"జయంతి"

"రండి సూర్యారావుగారూ! ఇలా కూర్చోండి."

"చిత్తం. మళ్ళీ అర్జంటుగా వెళ్ళిపోవాలి. దయ చేసి, పిలిపించిన పనేదో సెలవిస్తే..."

"ఇదిగో చెబుతున్నాగా. మీరు బొత్తిగా వీధిలో ఓ కాలూ, యింట్లో ఓ కాలూ పెట్టుకు కూర్చుంటే ఎలాగ! ఇలాంటి రహస్యవిషయాలు ఒక్కమాటలో ఎలా వెల్లడించడం చెప్పండి" అంటూ రాజారావు ఓరగా చూసేడు. సూరయ్య సంకోచిస్తూ కుర్చీమీద చతికిలబడి, టేబిలుపైన రెండు మోచేతులూ ఆనుకుని, గోడలమీద వ్రేలాడ గట్టిన పెద్ద డ్యాన్సుఫోటోలకేసి చూస్తున్నాడు. తన అధికారి అలా మాట్లాడుతూండడంవల్ల అతని కెందుకో భయంగావుంది. రాజారావు మళ్ళీ ఆరంభించేడు.

"చూడండి. మన తాతలనాటినుంచీ మా యిల్లూ, మీ యిల్లూ ఎదురెదురుగా వున్నాయ్. ఎన్నడూ మీగూ మేమూ ఇలాంటివి మాట్లాడుకునే అవసరం లేకపోయింది."

"ఎలాంటిమాటలు?" అన్నాడు సూరయ్య ఆత్రంతో.

రాజారావు: "ఇదిగో చెబుతున్నాగా, కాస్త శాంతంగా వినండి. మన వీధిపేరుప్రతిష్ఠలు మీకూ నాకూ యిద్దరికీ కావలసినవే గదా! వాటికి ఏ ప్రమాదం కలుగుతూన్నా చూసి వూరుకోలేం గదా" అన్నాడు.

"చిత్తం" అని ఇదిగా చూసాడు సూరయ్య.

"అందుకు మీకు నేనిచ్చే సలహా యేమంటే, మీ లైనులో సుందర్రామయ్యగారి అబ్బాయి లేడూ, వాడిని ఓ కంట కనిపెట్టి చూడండి. వాడి పని శ్రుతిమించి రాగాన పడుతోంది. అతన్ని నేనే ఒకసారి భయపెట్టి చూదామనుకున్నాను. అయినా, మీక జాగారం మంచిదయితే..."

"క్షమించాలి తమరు. నా సరోజ అలాంటిది కాదు" అని ఉద్రేకంతో అన్నాడు సూరయ్య.

అతని మొహంలో ఒక్కసారి రక్తం ఉప్పొంగింది. దేహమంతటా ముచ్చెమటలుపోసాయి. రాజారావు రెండు చేతుల వ్రేళ్ళూ కలుపుతూ నిశ్చలతతో "సూర్యారావుగారూ! మీరు కాస్త శాంతంగా ఆలోచించాలి. ఓపికతో పరిశీలించందే ఎవరినీ నమ్మకూడదు. నిప్పులేందే పొగ పుడుతుందా? ఇంతకీ మీరు నా శత్రుకోటిలో వారుకారే? సరోజ నా కళ్ళయెదుట పుట్టినపిల్ల. ఇలాంటి అభాండాలు వెయ్యడం నాకేమన్నా సరదా అనుకున్నారా? నాకింక వేరేపనులు లేవ?" అన్నాడు.

సూరయ్య కాస్త చప్పబడ్డాడు." రాజారావూ పిల్లల తండ్రి. యోగ్యుడు. ఉద్యోగస్థుడు. అతి నమ్మకము ఎక్కడా పనికిరాదు. చుట్టాలు దొంగలు అన్నాడొక మహనీయుడు అనుకుని, "అయితే మీ అనుమానానికి ఆధారాలేమిటో చెప్పండి. ఋజువయితే వాళ్ళపని పట్టే పూచీ నాది" అన్నాడు పైకి.

"కావలసినన్ని. అతని వాలకం చూడండి. ఆమె వాలకం చూడండి ఇంకా అనుమానముంటే మీ పెరట్లో సురపొన్నచెట్టు నడగండి. పెరటి మదురుగోడమీద కట్టిన తడకల నడగండి..."

"ఆ తడకలకి చిల్లులు పెట్టినవి గ్రామసిల్లలు."

"కావచ్చు. రెండుకాళ్ళ పిల్లులు కూడా ఆ దారినే ప్రవేశిస్తున్నాయి." అని పరిహాస పూర్వకంగా నవ్వేడు రాజారావు.

సూరయ్యకి తలకొట్టేసినట్లయింది. అయినా ఏమనగలడు? తెల్లారితే ఆఫీసులో ఆయనక్రింద పనిచెయ్యాలి. అందుచేత ఏమీ అనలేక 'శలవు" అని వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు. తిన్నగా వచ్చి తన వీధి అరుగుమీద తలపట్టుకు కూర్చున్నాడు. రాజారావు పరిహాసపునవ్వు అతని చెవుల్లో యింకా మారుమోగుతూంది. అతనిలో నిస్పృహ వ్యాపించింది. సాయంత్రపు చలిగాలి అతని మొహాన్నొత్తి మత్తెక్కిస్తూంది.

సరోజ తల్లిలేనిపిల్ల. భార్య తన చేతిలో విడిచిపోయిన పసిగ్రుడ్డుని కాపాడుకుంటూ పద్దెనిమిదేళ్ళు పదుపుగా పెంచుకున్నాడు. అలాంటి తన తత్తకణా ఈనాడు పేరుప్రతిష్ఠలు వీధిపాలు చేస్తోందంటే నమ్మటం కష్టంగా తోచింది సూర్యయ్యకు. నిజానికి తాను జీవిస్తూంట ఆమెను చూసుకునే గదా! ఆమెను ఒక యింటిదాన్ని చేసి తన ఉద్యోగం చాలించుకుని, ఏ రామేశ్వరమో వెళ్ళిపోవాలని ఏనాడో నిశ్చయించుకున్నాడు. కాని ఈలోగా ఇంత అఘాండం తన నెత్తిన పడుతుందని తానెన్నడూ వూహించలేదు. అలా యోచించగలిగి వుంటే కాలేజీలో చేర్పించి వుండడు. అందులోనూ ఆ సుందర్రామయ్యగారి అబ్బాయి చదువుతున్న కాలేజీలోనా! ఇంతలో అతని మనసులో రాజారావు మెదిలేడు. అంత పెద్ద ఆఫీసరు అబద్ధమెందుకు చెప్పాలి? తన యింటివిషయాలు పట్టించుకుని కష్టమైనా చెప్పేడంటే ఆ వీధి పేరుప్రతిష్ఠలు నిలబడానికే అనడంలో సందేహమేమిటి? ఆయనా ఓ పెద్ద సంసారే గదా!

ఇంతలో వీధిలో ఎవరో ఈలవేసుకుంటూ పోతున్నారు. సూర్యయ్య తలయెత్తి ఉలిక్కిపడ్డాడు. సుందర్రామయ్య కొడుకు! మొహం మీద పడుతూన్న క్రాపింగు ఎగరేసుకుంటూ మహాగర్వంగా నడుస్తున్నాడు. వెంటనే వెళ్ళి చెంపలమీద రెండు వాయించాలనిపించింది సూర్యయ్యకు. కాని, ధైర్యం చాలలేదు. భయమూ, నిస్సహాయత అతన్ని క్రుంగదీసేయి. గట్టిగా 'సరోజా' అని కేక పెట్టేడు.

"ఏం నాన్నా" అంటూ ఒక్క గంతులో ఆమె వచ్చింది లేడిపిల్లలా. ఆమె కన్నులు తామర పువ్వుల్లా విచ్చుకున్నాయి. అతడా కన్నులలోకి సూటిగా తొంగిచూసేడు.

"ఇదేమిటి నాన్నా! ఈ చల్లగాలిలో యిలా బొత్తాములు విప్పుకు కూర్చున్నావు! లోనికి నడు — జలుబుచేస్తుంది" అంటూ బొత్తాములు పెడుతూంది సరోజ. సూర్యయ్య ఒక్కసారి క్రుంగిపోయేడు. అతని కోపం ప్రేమగా మారిపోయింది. తనకు జలుబు చేస్తేనే సహించలేనిపిల్ల తన గౌరవం మంటగలిపే పనికి దిగదని నిర్ధారించుకున్నాడు. ఆమె ముంగురులు చేత్తో సర్దుతూ "ఏం చేస్తున్నావ్ లోపల!" అన్నాడు. "పుస్తకం చదువుకుంటున్నాను." అని చెబుతూ, రోడ్డువైపు బెదురుగాచూసి లోనికి వెళ్ళిపోయింది సరోజ. సూర్యయ్య చూస్తే రాజారావు ఎదురింటి వరండాలో పచారుచేస్తూ కనిపించేడు. ఎందుకో అతన్ని చూడడం యిష్టంలేక సూర్యయ్య లోనికి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. సూర్యయ్య ఓకంట సరోజని కనిపెడుతూనే వున్నాడు. సుందర్రామయ్య కొడుకు ఎప్పుడగుపించినా సందేహ దృక్కులతో అతని నఖశిఖ పర్యంతమూ పరిశీలిస్తూనే వున్నాడు. అయినా ఈ విషయంలో అతనికి తాడూ బొంగరమూ కూడా దొరకడంలేదు. సరోజలో అతని కెట్టిమార్పూ కనిపించలేదు ఆఖరికి "రాజారావుగారు చెప్పినదంతా అబద్ధం. తానంటే కిట్టనివాళ్ళెవరో యీ పుకారు ఆయన చెవిలో వేసి వుంటారు." అని వూరుకున్నాడు సూర్యయ్య.

నెలరోజులు గడిచేయి. ఆఫీసులో పని అధికంగా వుండడంవల్ల ఒకరోజు సాయంత్రం ఆలస్యంగా ఇల్లు చేరుకున్నాడు సూర్యయ్య. తన వీధి అరుగుమీద ఎక్కి తలుపు కొట్టబోతున్నాడు. ఒక్కసారి చకితుడై ఆగిపోయేడు. లోపలనుంచి ఏవో మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఇప్పటికైనా నామాట వినవా సరోజా"

"దయచెయ్యండి. ఎన్నిసార్లు చెప్పాలి. మా నాన్నవచ్చే టైంకూడా అవుతుంది."

'సరే" వెడతాను. రాత్రి పన్నెండు గంటలికి వస్తాను. మరచిపోకు"—

సూర్యయ్య చెయ్యి అతనికి తెలియకుండా తలుపుమీద దబదబా మోదింది. అతడు ఉద్రేకం పట్టలేక పోయేడు. పళ్ళు గట్టిగా పిండుకోవడంలో నాలిక కూడా కరుచుకున్నాడు. ప్రళయ రుద్రునిలా "సరోజా" అని గర్జించేడు.

తలుపు తెరుచుకుంది. సూర్యయ్య ఒక్కసారి యిల్లంతా పరికించి పెరటిలోకి వెళ్ళేడు. ఆ చిరుచీకటిలో మడురుగోడమీది తడకలలో ఏదో జరజర లాడింది, సూర్యయ్య విస్తుపోయాడు. కూతుర్ని పిలిచి "ఇప్పుడు లోపల ఎవరు మాట్లాడుతూంట" అన్నాడు.

"రేడియో నాన్నా" అంది సరోజ. సూరయ్య నమ్మకపోయినా నమ్మినట్లు నటించేడు. "దొంగకి తగిన శాస్తి చెయ్యాలంటే దొంగతనంగానే పట్టుకోవాలి" అనుకున్నాడు. పట్టుకున్నాక కూతురిమీద ఏమీ జాలి చూపకూడదనుకున్నాడు. అతడు విన్న ఆఖరిమాటలు "రాత్రి పన్నెండుగంటలకి వస్తాను" అన్నవి అతనికి పదేపదే వినిపిస్తూన్నాయి.

నిజానికి ఆ రాత్రి సరోజ చేతివంట తినాలనిపించలేదు సూరయ్యకి. అయినా తన అనుమానం బయలుచేసి కార్యభంగం చెయ్యకూడదని విస్తరి ముందు కూర్చున్నాడు. అతనికాపూట తిండి సహించలేదు. అయినా ఎలాగో నాలుగు మెతుకులు కొరికి చల్లగా లేచిపోయాడు. వెంటనే నిద్రవస్తూన్నట్లు నటిస్తూ మంచమెక్కి, దుప్పటి ముసుగు పెట్టేడు. సరోజ ఇంటిపనులన్నీ సర్దుకు "ఏంనాన్నా! మీ వంట్లో బాగాలేదా" అంది.

"ఏ! పిడుగులా వున్నాను. నాకేరోగం వస్తుంది" అన్నాడు తండ్రి.

"మరి అన్నం సరిగా తినలేదేం ఈ పూట?"


"ఓసారి తినకపోతే లోటేం వచ్చింది! పోయి పడుకో పెందరాడే. నాకు నిద్రవస్తోంది" అని చీదరించుకున్నాడు సూరయ్య.

సరోజ దీపమారిపివేసి పడుకుంది. సూరయ్యకి నిద్రపట్టడంలేదు. అతని మేధస్సులో దేవదానవ సంగ్రామం జరుగుతూంది. మనస్సుకు శాంతిలేక యమయాతన పడుతున్నాడు.

"ఛీ! ఇలా వేగుతానెందుకు. ఈ రాత్రి అటో, యిటో తేల్చివేస్తాను. నేను అపనింద పడలేను. వీళ్ళభరతం పట్టలేకపోతే, యింకా నా మగతనం ఎందుకు!" అనుకున్నాడు. మళ్ళీ కొంతసేపున్నాక యింకేవోభావాలు అతనిలో మెలిగేయి.

"పోనీ సరోజకీ ఆ పిల్లాడికీ పెళ్ళిచేసేస్తే... వాడికొచ్చిన లోటేమిటి? చదువులో సంపదలో తానంతకన్న మంచిసంబంధం తేగలడా!"... మళ్ళీ అతని మనసు మారింది.

"అలాంటి అభిలాష వున్నవాడు సుందర్రామయ్య స్వయానా వచ్చి తన్ని అడిగి వుండును. విషయాలు ఇంత దొంగతనంగా జరిగి వుండవు. ఎటుపోయి ఎటువచ్చినా సుందర్రామయ్యకేం నష్టం? ఇంతకీ సరోజకి బుద్ధివుండక్కర్లేదూ!"



దూరాన చర్చిగంట పదకొండు కొట్టింది. సూరయ్య నెమ్మదిగా లేచేడు. తన మంచంమీద కొన్ని గుడ్డలు పడేసి, మనిషి పడుకున్నట్లు దుప్పటి కప్పేడు. కాలిమునివ్రేళ్ళమీద నెమ్మదిగా నడుస్తూ తలుపుతీసి పెరట్లో అడుగు పెట్టేడు. మూలన వున్న దుడ్డుకర్ర చేత్తో పుచ్చుకుని, తలుపు చేర వేసేడు. మెల్లగానడచి సురపొన్నచెట్టు మొదట్లో కూర్చున్నాడు. అతని గుండె దడదడా కొట్టుకుంటూంది. పన్నెండు గంటలు వినిపించాయి. సూరయ్య తనను తాను హెచ్చరిక పరచుకున్నాడు.

ఇంతలో మదురు గోడమీద తడకల్లో ఏదో శబ్దమయింది. సూరయ్య చెవులప్పగించి వింటున్నాడు. మొదట జరజరా తొండ పాకినట్లు, తర్వాత పాము, మ్రానుపిల్లిలా అనిపించి కడకు లోనికిదూకిన శబ్దమయింది. సూరయ్య లేచి నిలుచుని ఎడమచేతిలోని దుడ్డుకర్ర కుడిచేతిలోకి మార్చుకున్నాడు. ఒక మానవాకృతి ముసుగు వేసుకుని మెల్లగా సురపొన్న చెట్టుకేసి వస్తూండడం చూసేడు. అప్పటికి గుడ్డివెన్నెల వచ్చింది. ఆవ్యక్తి దగ్గరగావచ్చి "సరోజా" అన్నాడు. సూరయ్యకి వొళ్లు తెలియలేదు. దుడ్డుకర్ర పైకి ఎత్తి విసిరేడు. ఆవ్యక్తి ప్రక్కకి తప్పించుకుని పరుగులంకించుకున్నాడు. వేగంతో సూరయ్య వెంబడించేడు. ఆవ్యక్తి గోడ ఎక్కుతూండగా సూరయ్య దుడ్డుకర్రతో రెండు మోదేడు. ఈ మాటు బలంగా కాళ్ళమీద తగలడంవల్ల ఆమనిషి "అమ్మా" అంటూ గోడ రెండోవైపుని పడిపోయేడు. సూరయ్య అమితంగా భయపడ్డాడు. గోడవతల ఏమయిందీ చూడడానికి అతనిలో ధైర్యంలేదు. వెంటనే యింట్లోకివచ్చి ముసుగుపెట్టి పడుకున్నాడు. ఆతర్వాత చాలాసేపటి వరకూ అతనికి నిద్రపట్టలేదు. తాను తప్పుచేసానేమోనను కున్నాడు. కాళ్ళువిరిగిన కొడుకుని తీసుకుని సుందర్రామయ్య తనమీదికి దెబ్బలాటకి వస్తున్నట్లు భ్రమించేడు. ఆ భయం బరువుతో యోచించి యోచించి ఎలాగో నిద్రపోయాడు.

మరునాటి ఉదయం లేవగానే వీధిలో జన కోలాహలం విని చాలా భయపడ్డాడు సూరయ్య. తలుపుతీసి విషయం తెలుసుకుని ఆశ్చర్యపడ్డాడు. రాజారావుగారి కాలు విరిగిందని జనం ఆయన్ని సందర్శిస్తున్నారు. ఇంతలో ఆంబ్యులెన్సు వచ్చి ఆయన్ని ఆసుపత్రికి తీసుకుపోయింది.

ఆసుపత్రిలో కాలువిరిగి పడుకున్న రాజారావు ఊరుకోలేదు. సుందర్రామయ్య కొడుకుమీద కేసు పెట్టాడు. ఆ అబ్బాయి సూరయ్య మదురుగోడ దాటుతూండగా తా నడ్డగించాననీ, తనని వాడు కొట్టేడనీ కేసు. పక్కయింటి పేరయ్యలిద్దరు సాక్ష్యం. కేసు బలపడి ఆ అబ్బాయికి రెండునెలల ఖైదు శిక్షపడింది. అయినా రాజారావు సంతృప్తి పడలేదు. సూరయ్యా, సరోజా ఆ వీధిని వుండతగదని వచ్చేపోయేవాళ్ళ చెవిని వేసేడు. ఈ సంగతికి లోకం కోడైకూసింది. సూరయ్య ఓరోజున సుందర్రామయ్యవద్దకు వెళ్ళేడు. అతడు సాదరంగా అంగీకరించి సాగనంపేడు.

రెండునెలలు గడిచేయి. రాజారావు ఆ వేళనే ఆఫీసులో జాయిన్ అయ్యేడు. సాయంత్రం సూరయ్య అతనిముందో కాగితంవుంచి "ఇకముందు మీకూ, మీ వుద్యోగానికీ ఓనమస్కారం" అన్నాడు. రాజారావు చకితుడై "ఇదేమిటి, రాజీనామా?" అనగా సూరయ్య "చిత్తం. నేనెవరికోసం ఉద్యోగం చేస్తున్నానో ఆమె పెళ్ళి స్థిరమయింది. ఇక నా మట్టుకు నాకే లోటూ లేదు" అన్నాడు.

"ఎవరు, సరోజ పెళ్ళా? ఎవరితో..."

"తమ వాక్యానుసారం సుందర్రామయ్య కొడుకుతో;"

"ఆఁ, ఆమె అంగీకరించిందా?" అన్నాడు రాజారావు. సూరయ్య చిరునవ్వుతో యిలా అన్నాడు:

"వాళ్ళు ప్రేమించుకున్నట్లు తమరేగా చాటింపు వేశారు. అందుకు ఆమె ఎందుకంగీకరించదు? దానికేంలెండి. పెళ్ళికి తప్పక రండి. అభాండాల వెయ్యడానికి అక్కడ చాలామంది పిల్లలు దొరుకుతారు."

"షటప్!" అన్నాడు రాజారావు.

"సరే. తమ ఆజ్ఞ ఆఖరుసారి పాటిస్తున్నాను. ఇక మీరు ఆజ్ఞాపించరు-నేను పాటించనూ పాటించను." అంటూ బయటికివచ్చేసేడు సూరయ్య. అప్పుడతని పాదాలలో ఎక్కడనుంచో కొండంత సత్తువ వచ్చింది. పెళ్ళి సన్నాహాలకోసం చరచరా నడిచిపోతున్నాడు. ★